www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 9 జనవరి 2023
5
ఏలూరు

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నూజివీడు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులుగా ఆదిలక్ష్మి, రాజకుమారి

ప్రజాశక్తి - నూజివీడు
అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నూజివీడు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులుగా వై.ఆదిలక్ష్మి, పి.రాజకుమారి ఎన్నికయ్యారు. యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. సిఐటియు నూజివీడు కార్యదర్శి జి.రాజు నూతన కమిటీని వెల్లడించారు. అధ్యక్షులుగా వై.ఆదిలక్ష్మి(నూజివీడు), కార్యదర్శిగా పి.రాజకుమారి(ముసునూరు), కోశాధికారిగా కందుల శోభ(ఆగిరిపల్లి)తో పాటు మరో 20 మంది సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు. సభ్యులుగా దొండపాటి మణెమ్మ, జెల్లి పద్మ, విద్యావతి, జ్యోతి, వసుంధర, కనకదుర్గ, అనురాధ, పుల్లమ్మ లక్ష్మీ భాయ్, భవానీ మరికొందరు ఉన్నారు.

భీమడోలు మండలంలో జిఒ కాపీలు దగ్ధం చేస్తున్న కూలీలు, నాయకులు

జిఒ 1ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు
జిఒ1ని రద్దు చేయాలని ఐలు రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది.

ఏలూరులో..

ఈ సందర్భంగా ఐలు జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ మాట్లాడుతూ సభలు, సమావేశాలకు పోలీసులు రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ప్రజల, పార్టీల, సంఘాల ప్రజాస్వామ్య హక్కు రద్దు చేయాలని చూడటం సరికాదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ప్రదర్శనలు, సభలు రోడ్ల మీద జరపరాదంటూ విడుదల చేసిన జిఒ 1ని రద్దు చేయాలని, ఇది ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుని సమస్య కాదని అన్నారు. బిజెపి ఈ దుర్మార్గ జిఒను ప్రెస్‌మీట్ పెట్టి మరీ బలపరచడం దారుణమన్నారు. 1861 నాటి బ్రిటిష్ చట్టం ఆధారంగా ఈ జిఒ విడుదల చేయడం బాధాకరమన్నారు. సిపిఐ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి తప్ప వేరే ఎవరూ ప్రదర్శనలు, సభలు జరపరాదనే విధంగా జిఒ లక్ష్యంగా ఉందన్నారు. అందరూ కలిసి ఈ చీకటి జిఒ రద్దుకోసం నిరసన కార్యక్రమాలు కొనసాగించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఏలూరు నగర కార్యదర్శి గెద్దా విజయభాస్కర్, నగర నాయకులు పి.వెంకట్, కాంగ్రెస్ నాయకులు ఆర్.రామ్మోహన్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, టిడిపి నాయకులు దాసరి ఆంజనేయులు, జనసేన నాయకులు ఎన్‌కెసి.నరేష్, ఆలిండియా దళిత రైట్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షురాలు అర్.మణిసింగ్, ఐలు నాయకులు కూన కృష్ణారావు, వై.మణికంఠతేజ, జి.రాజా, సిఐటియు నాయకులు కె.విజయలక్ష్మి, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యులు మేతర అజయ్‌బాబు, టిడిపి లీగల్ అడ్వైజర్ జె.ప్రసాద్, జెవివి సమత జిల్లా కన్వీనర్ ఎం.తేజశ్రీదేవి, నాయకులు బి.శ్రీనివాసరావు, వికలాంగుల సంఘం నాయకులు పి.రఘురాం, కాంగ్రెస్ నేత ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భీమడోలు: భావ ప్రకటన స్వేచ్ఛను హరించే జిఒ 1ని రద్దు చేయాలంటూ హమాలీ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో ఆదివారం పాతూరు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ గోదాముల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిఒ కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఈ జిఒ అప్పటి బ్రిటిష్ ప్రభుత్వప్రజావ్యతిరేకతను అణిచివేసేందుకు ప్రవేశపెట్టిందని, దాన్ని తిరిగి ప్రస్తుత సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేయడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు గడ్డి సూర్యారావు, మత్తే ప్రసాద్, పి.ప్రసాద్, వై.శ్రీను పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జుల పాలనతో కుంటుపడిన ఏజెన్సీ అభివృద్ధి

ఐఎఎస్‌లను ఐటిడిఎ పిఒలుగా నియమించాలి
సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు
ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కీలకమైన ఐటిడిఎలో ఇన్‌ఛార్జి అధికారులతో పాలన సాగించడంతో గిరిజనాభివృద్ధికి తీవ్ర ఆటంకంగా ఉందని, ఐటిడిఎ పిఒగా ఐఎఎస్ అధికారులను నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న ఎ.రవి

స్థానిక పవరుపేటలోని ఉద్దరాజు రామం భవనంలో ఆదివారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుల సమావేశం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఐటిడిఎ అభివృద్ధికి ఐఎఎస్ అధికారులను ఐటిడిఎ పిఒగా నియమించాలన్నారు. రెగ్యులర్ పిఒ లేకపోవడంతో గిరిజనులు తమగోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జులు కేవలం ఐటిడిఎ సమావేశాలకు మాత్రమే వచ్చి వెళుతున్నారని, గిరిజనుల కోసం ప్రతీ బుధవారం నిర్వహించే గిరిజన దర్బారుకు అధికారులు అందుబాటులో లేకపోవడంతో గిరిజనులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. నిర్వాసితులకు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఐటిడిఎ పిఒ ప్రత్యేక అధికారులుగా ఉండి వాళ్లకు ఉన్న సమస్యలు, ఇబ్బందులు పరిష్కరించేవారని తెలిపారు. కొంతకాలం నుండి ఇన్‌ఛార్జి పిఒలను నియమించి పరిపాలన సాగించడంతో, ఒకరి తర్వాత ఒకరిని వెంటవెంటనే బదిలీ చేయడంతో గిరిజనుల బాధలు వినే అధికారులు లేకుండా పోయారన్నారని వాపోయారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ, డిడి కీలక అధికారులందరూ ఇన్‌ఛార్జులతోనే పరిపాలన చేయించడం చూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజనుల పట్ల ఏ మాత్రమూ చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందని విమర్శించారు. డిఎంహెచ్ఒ, ట్రైబల్ వెల్ఫేర్ డిడి తదితర అధికారులందరినీ నియమించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ఐటిడిఎ అభివృద్ధి కోసం రెగ్యులర్ అధికారులను నియమించాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలోని ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఎన్‌విడి.ప్రసాద్, పి.కిషోర్, ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, జి.రాజు పాల్గొన్నారు.

బైజూస్‌తో ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు
ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థ బైజూస్‌కు విద్యాబోధనను అప్పగిస్తూ చేసుకున్న ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం పున:పరిశీలించాలని, తక్షణం రద్దు చేసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయునికి ప్రత్యామ్నాయం టెక్నాలజీ కాదని, టెక్నాలజీ బోధనకు సహాయకారిగానే ఉంటుందని తెలిపారు. ఇంతవరకూ విద్యాబోధనలో ప్రావీణ్యం లేని బైజూస్ ట్యూషన్ సెంటర్స్ మాత్రమే నడిపే సంస్థకు రాష్ట్ర విద్యారంగంలో బోధనను అప్పగించడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. బైజూస్ ఇచ్చిన ట్యాబ్‌లలో ఉన్న కంటెంట్ ఉపాధ్యాయులు చెప్పే కంటెంట్ తేడా వల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారన్నారు. బైజూస్ వారు చెప్పే విద్యా విధానం నాణ్యమైందని ఎలా అంచనాకు వచ్చిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పులతో నడిచే బైజూస్‌కు పాఠాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికీ ఉపాధ్యాయులు పాఠాలు చెబితే ట్యాబ్‌లలో చూడటంగా ఉంటే, భవిష్యత్‌లో ట్యాబ్‌లలో చెప్పిన పాఠాలకు ఉపాధ్యాయులు అనుమానాలు తీర్చే వారిగా మిగిలిపోతారని పేర్కొన్నారు. ప్రభుత్వం బైజూస్ ఒప్పందాన్ని పరిశీలించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.రవికుమార్, పివి.నరసింహారావు మాట్లాడుతూ ఎస్‌సిఆర్‌టి వారు రూపొందించిన గణితం అత్యంత ప్రామాణికంగా ఉందని నిరూపితమైందని, అయినా ఎన్‌సిఇఆర్‌టి పేరుతో సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సిబిఎస్‌సిఇలో ఉన్న ప్రయోగ పద్ధతి, సృజనాత్మక అంశాలను ఎస్‌సిఆర్‌టి తీసుకుని మన రాష్ట్ర సిలబస్‌నే కొనసాగించాలని కోరారు.

సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని, మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు డిడిఒ పవర్స్ ఇచ్చి పాత బకాయిలు వెంటనే చెల్లించాలని తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, సహాయ అధ్యక్షులు బి.సుభాషిణి, కోశాధికారి ఎస్‌కె.ముస్తఫా అలీ, కార్యదర్శులు బి.అనురాధ, పివి.సాగర్ బాబు, ఎ.రాజు, ఎంవి.అప్పారావు, జి.రాజేంద్రప్రసాద్, బివి.రవీంద్ర, బి.బాలకృష్ణ, ఎస్.సుధారాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.కనకదుర్గ, విబివిఎస్.సుబ్రహ్మణ్యం, పి.శ్రీనివాస్, నున్న ఆంజనేయులు, ఆడిట్ కన్వీనర్ ఎంవి.బేతాళరావు సమావేశంలో పాల్గొన్నారు.

కోడి పందేల బరులు ధ్వంసం

జంగారెడ్డిగూడెం: మండలంలోని శ్రీనివాసపురంలో కోడి పందేలు నిర్వహణకు ఏర్పాటు చేసిన బరులను పోలీసులు ఆదివారం సాయంత్రం ధ్వంసం చేశారు. సిఐ బాల సురేష్‌బాబు ఆధ్వర్యంలో శ్రీనివాసపురం, సుబ్బమ్మపేట ప్రాంతాల్లో కోడిపందేలకు బరులు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం అందడంతో వాటిని ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేశారు. అలాగే ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామని సిఐ బాల సురేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి ముసుగులో కోడిపందేలు, పేకాట, నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే కోడి కత్తులు తయారు చేసే వారిని, గతంలో కోడిపందేలకు వెళ్లిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, కోడిపందేలు, పేకాట ఆడినా, లేదా చూసినా నేరమే అవుతుందని తెలిపారు. ఇలాంటి కేసుల్లో యువత ఇరుక్కుంటే వారి భవిష్యత్ దెబ్బతింటుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలపట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.


ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : డిఎన్ఆర్

ప్రజాశక్తి - ముదినేపల్లి
పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు (డిఎన్ఆర్) అన్నారు. మండలంలోని కొరగుంటపాలెంలో ఆదివారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో..లేదో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో గ్రామాల ముంగిటకు పాలనను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నదేనన్నారు. ఇతర రాష్ట్రాలు సైతం ఇక్కడి సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపి సునీత, రాధా, పార్టీ మండల కన్వీనర్ ఎం.ఏసుబాబు, గ్రామ సర్పంచి పేరే రామకృష్ణ, గ్రామ ప్రముఖులు అచ్యుత రాంబాబు, ఇఒపిఆర్‌డి టివి.సారధి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, వైసిపి నాయకులు, కార్యకర్తలు గ్రామప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొరగుంటపాలెం గ్రామ మాజీ సర్పంచి బత్తుల వీరవెంకట చిరంజీవి సోదరులు బత్తుల శేఖర్, బత్తుల నాగరాజు, మాజీ ఎంపిటిసి సభ్యులు నాయుడు రవీంద్రనాద్‌ఠాగూర్, సాగిరాజు ఆంజనేయరాజు వైసిపిలో చేరారు. వీరికి ఎంఎల్ఎ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు.

చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం
జెఆర్‌జి డిజిటల్ కేబుల్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సాహభరితంగా సాగాయి. ఆదివారం స్థానిక జెడ్‌పి బాలుర పాఠశాలలో తపన ఫౌండేషన్ సహకారంతో సంక్రాంతి సంబరాలలో భాగంగా సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు, భోగి మంటలు, ముగ్గుల పోటీలు, వాలీబాల్ కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ టీవీ సీరియల్ నటి హరిత, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి భోగి మంటలను వెలిగించి సంబరాలను ప్రారంభించారు. జెఆర్‌జి డిజిటల్ కేబుల్ నెట్‌వర్క్ ఎమ్‌డి పాలపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా ఫ్రిజ్, రెండో బహుమతిగా వెండి గ్లాసులు, మూడో బహుమతిగా వెండి పట్టీలు అందించారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలో పాల్గొన్న వారికి ఆకర్షణీయమైన బహుమతులు అందించామన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి చౌదరి, జెడ్‌పిటిసి సభ్యులు పొల్నాటి బాబ్జీ, మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు కంచర్ల వాసవీరత్నం, ముప్పిడి వీరాంజనేయులు, రోటరీ క్లబ్ అధ్యక్షులు దాకా కృష్ణ, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ రీజియన్ ఛైర్మన్ వందనపు సాయిబాల పద్మ, మున్సిపల్ కమిషనర్ పి.భవాని ప్రసాద్, సిఐ బాలసురేష్‌బాబు పాల్గొన్నారు.

మెగా ఫ్యామిలీపై అనుచిత వ్యాఖ్యలు సరికావు : జనసేన

ప్రజాశక్తి - కైకలూరు రూరల్
జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై, మెగాస్టార్ చిరంజీవిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆ పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జి కొల్లి వరప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మెగా ఫ్యామిలీపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే జనసేన కార్యకర్తల సత్తా చూడాల్సి వస్తుందని రోజాను హెచ్చరించారు. వీర మహిళ తోట లక్ష్మి మాట్లాడుతూ మెగా ఫ్యామిలీ గురించి మాట్లాడేస్థాయి రోజాకు లేదన్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పోలిశెట్టి, పూలే స్ఫూర్తితో విద్యారంగాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు
ఎస్ఆర్.పోలిశెట్టి, సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోలిశెట్టి వర్ధంతి సభ, సావిత్రిబాయి పూలే జయంతి సభ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యారంగ వికాసం కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఉద్యోగం కంటే ఉద్యమ బాటే ముఖ్యమని నమ్మి తన జీవితాన్ని త్యాగం చేసిన ఎస్ఆర్.పోలిశెట్టి మనకు ఆదర్శమని కొనియాడారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు చదువుకోవటం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని భావించి మహిళల చదువు కోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలేను అందరూ స్మరించుకోవాలని కోరారు. పాఠశాలల విలీనం పేరుతో పాఠశాలల సంఖ్య తగ్గించడం, ఉపాధ్యాయులను కుదించడం ద్వారా విద్య ప్రయివేటీకరణ వైపు వెళుతుందని విమర్శించారు. అదే జరిగితే పేదలు చదువుకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలిశెట్టి, పూలే స్ఫూర్తితో ప్రజలందరికీ విద్య సమాన అవకాశాలు కల్పించడానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, బి.సుభాషిణి, కోశాధికారి ఎస్‌కె.ముస్తఫా అలీ, కార్యదర్శులు బి.అనురాధ, పివి.సాగర్ బాబు, ఎ.రాజు, ఎంవి.అప్పారావు, జి.రాజేంద్రప్రసాద్, బివి.రవీంద్ర, బి.బాలకృష్ణ, ఎస్.సుధారాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.కనకదుర్గ, విబివిఎస్.సుబ్రహ్మణ్యం, పి.శ్రీనివాస్, నున్న ఆంజనేయులు, ఆడిట్ కన్వీనర్ ఎంవి.బేతాళరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, చీరల పంపిణీ

జంగారెడ్డిగూడెం: లక్కవరంలో రావిపాటి సత్యనారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని శ్రీరామచంద్ర విద్యాసంస్థల ఎఒ రమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని లక్కవరంలో సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమేష్, జి.వెంకటేశ్వరరావు 50 మంది వృద్ధులకు దుప్పట్లు, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సేవా సమితి ఆధ్వర్యంలో గతంలో స్థానిక వీధుల్లో స్థానికులు సేద తీరడానికి బల్లలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రావిపాటి అనసూయ, సెక్రటరీ ప్రెసిడెంట్ ఆర్.సత్యనారాయణ, ఎ.నాగేంద్రకుమార్, గెల్లా శ్రీపాల్‌పాస్టర్, రావుపాటి దేవిభాగ్యరాజు, చందమామల లక్ష్మణరావు, యడ్లపల్లి భాగ్యరాజు, ఆరుగొల్లు నాగేంద్రకుమార్ మాస్టారు, మద్దుకూరి నరసింహారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్

జంగారెడ్డిగూడెంలో హీరోయిన్ పాయల్ రాజ్ పుత్ సందడి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం
పట్టణంలో సినీనటి పాయల్ రాజ్‌పుత్ సందడి చేసింది. ఇక్కడ నూతనంగా నిర్మించిన సిఎన్‌ఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉదయం 11:30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజాతో పాటు పాయల్ రాజ్ పుత్ రిబ్బన్ కట్ చేసి షాపింగ్ మాల్ ప్రారంభించారు. అలాగే అందులోని మల్టీ థియేటర్స్, ఫుడ్ కోర్టులను సిఎన్‌ఆర్ షాపింగ్ మాల్ యజమానులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మెట్రో సిటీ వంటి ప్రాంతాల్లో ఉండే పెద్దపెద్ద మాల్స్ నేడు జంగారెడ్డిగూడెంలో ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. ఆహ్లాదానికి అవసరమైన వినోదాత్మక సినిమాలు చూడడంతో పాటు ఇతర షాపింగ్ చేయడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు.

తనపై జంగారెడ్డిగూడెం ప్రాంత ప్రజలు చూపిస్తున్న అభిమానం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. అలాగే షాపింగ్ మాల్ యాజమాన్యానికి పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో జిల్లాకు నాలుగో స్థానం : కలెక్టర్

ఇప్పటి వరకూ 1.17 కోట్ల పనిదినాల కల్పన - రూ.240 కోట్లు వేతనాల చెల్లింపు

ప్రజాశక్తి - ఏలూరు
ఏలూరు జిల్లా ఏర్పాటు అనంతరం 28 మండలాలు 581 గ్రామ పంచాయితీలుగా ఉన్న నూతన జిల్లాలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నేతృత్వంలో ఉపాధి హామీ చట్టం అమలు మరింత ఊపందుకుని రాష్ట్రంలోనే అత్యధిక పనులు కల్పించిన నాలుగో జిల్లాగా రూపొందిందని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డి.రాంబాబు చెప్పారు. ఉపాధి హామీ పనుల అమలుకు అత్యంత అనువైన జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, ప్రకాశం జిల్లాల తరువాత ఏలూరు జిల్లా నిలిచిందన్నారు. పని అడిగిన ప్రతి పేద కుటుంబానికి వంద రోజులు పని కల్పించడంలో జిల్లా ముందంజలో ఉందన్నారు. జిల్లాలో మూడు లక్షల 20 వేల జాబ్ కార్డులు జారీ చేశామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ నాలుగు లక్షల 39 వేల మందికి ఉపాధి కల్పించామని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ ప్రభుత్వం కోటీ 17 లక్షల పని దినాలు లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటికే కోటీ 17 లక్షల 45 వేల పని దినాలు పూర్తిచేశామని తెలిపారు. వేతనాల రూపంలో రూ.240.06 కోట్లు కార్మికులకు అందించామని తెలిపారు. మరో రూ.88 కోట్ల మెటీరియల్ కాంపోండ్ కింద భవన నిర్మాణాలకు ఖర్చు చేశారని పేర్కొన్నారు. ఉపాధిహామీ కింద ఇప్పటివరకు వేతన రూపంలో ఇచ్చిన రూ .240.06 కోట్లలో అత్యధికముగా రూ .136.73 కోట్లు (57శాతం) కేవలం మహిళా వేతనదారులు పొందారన్నారు. ఇప్పటివరకూ ఉపాధిహామీ పనుల్లో ఎస్‌సిలు 36.64 శాతం, ఎస్‌టిలు 9.14 శాతం పాల్గొన్నారని తెలిపారు.

ప్రస్తుతం జిల్లాలో అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకంలో ప్రతి ఇంటికీ ఈ పథకం ద్వారా 90 రోజుల వేతనం, రోజుకు రూ.257 కూలి చొప్పున వేతనం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ రూపేణా ఇప్పటివరకు 14 లక్షల పనిదినాలకు గాను రూ.35.98 కోట్లు వేతనాలుగా చెల్లించామన్నారు. అదే విధంగా పోలవరం నిర్వాసిత కాలనీల్లో పునరావాసం కల్పించిన చోటే ఆ కుటుంబాలకు పని కల్పిస్తూ ఇప్పటివరకూ రూ.1.61 కోట్లు వేతనాల రూపంలో చెల్లించామన్నారు. డ్వామా ద్వారా అమలవుతున్న ఉపాధి హామీ పథకంలో పని అడిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడంతో పాటు ప్రతి సచివాలయ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఐదు రకాల భవనాలైన గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, పాలసేకరణ కేంద్రాల నిర్మాణం జరుగుతోందని, ఇవికాక ఇతర సంక్షేమ పథకాలు ఈ ఏడాది డ్వామా ద్వారా అమలు జరుగుతున్నాయని తెలిపారు.

వైఎస్ఆర్ జలకళ కింద నాలుగు వేల బోర్లు మంజూరు చేశామని, మొక్కల పెంపకంలో 368 ఎకరాల్లో హార్టీకల్చర్ సాగుకు రైతులకు పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్ కింద 87 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంచుతున్నామని, వచ్చే ఏడాది 'మునగ' మొక్కలను ప్రతీ ఇంటికి ఇచ్చి పెంచేందుకు ప్రణాళిక తయారు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే టార్గెట్ పని దినాలు పూర్తి చేసేందుకు, ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు పీడీ తెలిపారు. వచ్చే మూడు నెలల్లో మరో 25 లక్షల పనిదినాల కల్పనకు మరో రూ.60 కోట్లు వేతనాల రూపంలో ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్, జెసి సూచనలతో జిల్లాలో ఉపాధి హామీ చట్టం విజయవంతంగా అమలవుతోందన్నారు.

గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతం

ఉదయం పరీక్షకు 69.57 శాతం, మధ్యాహ్నం 69.32 శాతం మంది హాజరు
పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు
జిల్లాలో ఆదివారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రమైన ఏలూరులో ఆరు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు సుమారు 69 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఆదివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షల తీరును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వట్లూరు సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్, ఏలూరు మోర్ మార్కెట్ రోడ్డులోని నారాయణ బాలుర జూనియర్ కళాశాల, వట్లూరు ఫ్లైఓవర్ సమీపంలోని సిఆర్‌ఆర్ మహిళా కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు.


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయన్నారు. జిల్లాలో ఆరు కేంద్రాల్లో 3,106 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఉదయం 2,161 (69.57శాతం) మంది, మధ్యాహ్నం 2,153 (69.32శాతం)మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఉదయం 10.00 గంటల నుంచి పేపరు1, మధ్యాహ్నం రెండు గంటల నుంచి పేపరు-2 పరీక్ష జరిగిందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి సీనియర్ జిల్లా అధికారిని లైజనింగ్ అధికారిగా నియమించామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు అత్యంత ప్రశాంతంగా జరిగినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షల అనంతరం ప్రశ్నాపత్రాలు, ఒఎంఆర్ షీట్లు, ఇతర పరీక్షా సామగ్రిని పూర్తి బందోబస్తుతో స్ట్రాంగ్ రూముకు చేర్చామని, తదుపరి ఎపిపిఎస్‌సి అధికారులు ప్రత్యేక భద్రతతో విజయవాడ తరలిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట ఆయా పరీక్ష కేంద్రాల లైజనింగ్ అధికారులు జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ, ఏలూరు ఆర్‌డిఒ పి.పెంచలకిషోర్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు ఉన్నారు.

వట్లూరు సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో 1100 మంది ఉదయం పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 779 మంది, మధ్యాహ్నం 775 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

వట్లూరు రైల్వేగేట్ సిఆర్‌ఆర్ పాలిటెక్నికల్ కళాశాల కేంద్రంలో పరీక్షలు రాయాల్సిన 500 మందిలో ఉదయం పరీక్షకు 337 మంది, మధ్యాహ్నం 337 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

సిఆర్‌ఆర్ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో 500 మందిలో ఉదయం 359 మంది, మధ్యాహ్నం 357 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

శ్రీచైతన్య జూనియర్ కళాశాల కేంద్రంలో పరీక్షలు రాయాల్సిన 406 మందిలో ఉదయం పరీక్షకు 303 మంది, మధ్యాహ్నం 302 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

ఏలూరు నారాయణ బాలుర జూనియర్ కళాశాల కేంద్రంలో ఉదయం పరీక్షకు 200 మంది, మధ్యాహ్నం 200 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

వట్లూరు సిఆర్‌ఆర్ మహిళా జూనియర్ కళాశాల కేంద్రంలో 300 మందిలో ఉదయం పరీక్షకు 183 మంది, మధ్యాహ్నం 182 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

పెయింటర్లు, ఆర్టిస్టుల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

పశ్చిమగోదావరి జిల్లా ఆర్టిస్ట్స్, పెయింటర్స్ అసోసియేషన్ 2023 క్యాలెండర్‌ను ఏపిపిఎడబ్ల్యుఎ రాష్ట్ర అధ్యక్షులు కె.వి.రాజు, డబ్ల్యుజెపిపిఎ అధ్యక్షులు పి.నాగబాబు ఆవిష్కరించారు. ఆ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం మండలంలోని చేబ్రోలు సాయి సాహితి పబ్లిక్ స్కూల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గతంలో ప్రమాదానికి గురై కాలు విరిగిన రవితేజకు డబ్ల్యుజెపిపిఎ అసోసియేషన్ తరపున రూ.పది వేలు, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.గంగరాజు, సహాయ కార్యదర్శి సిహెచ్.గాంధీ, కార్యదర్శి పి.సాల్మన్‌రాజు, చిత్రాలయ రాజు, ముఖ్య సలహాదారులు ఎమ్‌డి ఇర్షాద్ అహ్మద్, సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరులో 'చాయ్ చమక్'

ప్రజాశక్తి - ఏలూరు

వృద్ధులకు చాయ్, పండ్లు అందిస్తున్న వక్తలు

బాలవికాస్ భారతి ఆధ్వర్యంలో స్థానిక ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం వద్ద ఆదివారం చాయ్ చమక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడిచిన ఉగ్ర నరసింహారావు దంపతులు, వారి కోడలు, ఆమె తండ్రి న్యాయవాది జి.సూర్యతేజ, వారితో పాటు న్యాయవాది ఎవివి.దుర్గాప్రసాద్ పాల్గొని వృద్ధులకు చాయ్, పండ్లు అందించారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించినవారికి బాలవికాస్ భారతి ఆర్గనైజేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో రిటైర్డ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్యామ్ మృతి

జీలుగుమిల్లి: మండలంలో కొంతకాలం క్రితం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పని చేసి రిటైర్డ్ అయిన దుద్దే శ్యామ్ (73) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా నల్లజర్ల మండలంలోని దూబచర్లలో అతని కుమారుని వద్ద నివాసం ఉంటున్నారు. ఏడో తేది శనివారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని జీలుగుమిల్లిలోని ఆయన స్వగృహానికి తరలించారు. ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడ పని చేసిన అనుభవం ఉండటంతో ఆయన మృతదేహానికి పలువురు నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మండపం నిర్మాణ పనులు పరిశీలన

కైకలూరు రూరల్: కొల్లేటికోట శ్రీ పెద్దింట్లమ్మను ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనివెటి మండపం నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇఒ కందుల వేణుగోపాలరావు, దేవస్థాన పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

10 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండలంలోని బొర్రంపాలెంలో ఈనెల 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ బొర్రంపాలెంలో జీలుగుమిల్లి సిఐ జి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లకు ఎంట్రీ ఫీజు లేదన్నారు. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.ఐదు వేలు నగదు బహుమతి అందజేస్తామని, మండలంలో ఆసక్తి ఉన్న ఆటగాళ్లు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

12న ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - వేలేరుపాడు

సంక్రాంతి సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈనెల 12వ తేదీన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ ఆర్.శ్రీను తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ పండుగలను కుటుంబ సమేతంగా జరుపుకోవాలన్నారు. సాంప్రదాయ పండుగలు అంటేనే మహిళలతో కూడుకుందని, ఈ నేపథ్యంలో వారికి కూడా ప్రాధాన్యతనివ్వాలని ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ముగ్గుల పోటీలు, లెమన్ స్పూన్, మ్యూజికల్ ఛైర్స్, కప్స్ గేమ్స్ నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికీ బహుమతులు అందిస్తామన్నారు.

కోడిపందేల నిరోధానికి ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - ఏలూరు

సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, బెట్టింగ్, జూదాలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిఘా ఉంచామని తహాశీల్దార్ సోమశేఖర్ అన్నారు. ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ల సచివాలయంలో ఆదివారం కోడిపందేల నిషేధంపై సంబంధిత అధికారులు, గ్రామ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంలో కోడి పందేలు, పేకాట వంటి జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందేల నిర్వహణకు బరులు తయారు చేసినా, స్థలం ఇచ్చి ప్రోత్సహించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థాయిలో నియమించిన టీం సభ్యులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కోడిపందేలు, జూదం వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని వివరించారు. 144 ఉత్తర్వులు జారీ అయ్యాయని, చట్టవిరుద్ధ కార్యకలాపాల కోసం తమ భూములు/స్థలాలను ఇస్తున్న భూ యజమానులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. సమావేశంలో పలువురు పోలీస్ అధికారులు, గ్రామ కమిటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, విఆర్ఒలు పాల్గొన్నారు.

ముసునూరు: సంక్రాంతిని పురస్కరించుకుని కోడి పందేలు, జూదం, గుండాట వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహాశీల్దార్ దాసరి సుధ హెచ్చరించారు. ఆదివారం ఆమె విలేఖర్లతో మాట్లాడుతూ కోడి పందేలు, జూదం, గుండాట, పేకాట వంటి ఆటల నుండి యువత దృష్టిని మరల్చేందుకుగాను మండలస్థాయిలో వాలీబాల్ పోటీలు ముసునూరులో 9, 10 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. వీరిలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ బహుమతి రూ.ఐదు వేలు, ద్వితీయ బహుమతి రూ.నాలుగు వేలు, డివిజన్ స్థాయిలో గెలపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.పది వేలు, ద్వితీయ బహుమతి రూ.ఎనిమిది వేల నగదు ఆందచేస్తామని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

కోడి కత్తుల తయారీదారులు అరెస్ట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

సంక్రాంతి సందర్భంగా కోడిపందేలకు కత్తులు తయారు చేస్తున్నవారిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలో పోలీసులు ఆదివారం తనిఖీలు చేశారు. తనిఖీల్లో సింగరాయపాలేనికి చెందిన చేబోయిన శివప్రసాద్, విశ్వనాద్రిపాలేనికి చెందిన పరసా ఏసుల వద్ద నుంచి 125 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షణ్ముఖసాయి తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కోడిపందేలు, పేకాట, కోడి కత్తులు తయారీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దెందులూరు : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని దెందులూరు ఎస్ఐ ఇజ్జాపు వీర్రాజు హెచ్చరించారు. దెందులూరు గ్రామంలో ఎస్ఐ వీర్రాజు తన సిబ్బందితో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామంలోని కొండూరు సత్యనారాయణ వద్ద సుమారు 125 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని దెందులూరు మండల ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, తహాశీల్దార్ ఎన్‌వి నాంచారయ్య సమక్షంలో హాజరు పరచగా బైండోవర్ కేసు నమోదు చేశారు.

13 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

మండలంలోని పలు గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసినట్లు టౌన్ సిఐ ఎంవిఎస్.నాగరాజు తెలిపారు. ఆదివారం సిబ్బందితో కలిసి ఆయన శ్యామలాంబపురం, కైకలూరులో పేకాట ఆడుతున్న 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.27,280 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు

అధికార పార్టీ నాయకుల అండతోనే అక్రమాలు !

మట్టి మాఫియాతో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు కుమ్మక్కు

ప్రజల నుంచి విమర్శలు - ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు

మట్టిని తరలించుకుపోతున్న ట్రాక్టర్, టిప్పర్

మట్టిని టిప్పర్‌లోకి లోడు చేస్తున్న జెసిబి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మట్టిమాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పచ్చని పంటపొలాల్ని చేపల చెరువులుగా మార్చుకునేందుకు అనుమతులు తీసుకొని మట్టిని మాత్రం ఇతర ప్రాంతాలకు తరలించుకుపోయి అమ్ముకుంటూ రూ.లక్షలు బడాబాబులు సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండాలతో మైనింగ్ అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఈ తంతు అంతా ముదినేపల్లి మండలంలో జరుగుతోంది.

మండలంలోని బొమ్మినంపాడు గ్రామ సొసైటీ భవనం ఎదురుగా రెండు పంటలు పండే భూమిని చెరువుగా మార్చుకునేందుకు అనుమతి తీసుకొని మట్టిని మాత్రం బయటకు విక్రయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. చేపల చెరువుల తవ్వకాల పేరుతో యధేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. వైసిపి మండల నాయకులు, రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారుల కనుసన్నల్లో మట్టి మాఫియా తవ్వకాలు జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. చెరువులో మట్టిని అక్రమంగా జెసిబిలతో రాత్రి పగలు అనే తేడా లేకుండా నిరంతరం తవ్వకాలు చేస్తున్నారు. అనుమతులు ఉన్నా నిబంధనల ప్రకారం 2.5 క్యూబిక్ మీటర్లకు మించి తవ్వకూడదు. క్షేత్రస్థాయిలో అంతకు మించి పది రెట్లు ఆదనంగా తవ్వకాలు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కొత్తగా వేస్తున్న రియల్ ఎస్టేట్స్, లేఆవుట్లకు టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇతర గ్రామాలకు మట్టిని తరలిస్తున్నారు. బొమ్మినంపాడు ఆర్ఎస్ నెంబర్ 289-2ఎ-2లో 4.6 ఎకరాల్లో చేపలచెరువు తవ్వుకునేందుకు అనుమతులు పొంది మట్టిని మాత్రం రేయింబవళ్లు అక్రమంగా తవ్వేస్తూ ఇతర ప్రాంతాలకు మట్టిని తరలిస్తూ అమ్ముకుంటున్న సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికార పార్టీ నాయకుల అండతో తవ్వకాలు

మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను అధికార పార్టీ నాయకులే చేస్తుండడంతో రెవెన్యూ, మైనింగ్ అధికారులు స్పందించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంక్రాంతి సమీపిస్తుండడంతో పలు గ్రామాల్లో చాలామంది పెద్ద రైతులు సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చేస్తున్నారు. ప్రధాన రహదారికి అనుకుని ఉన్న భూమిని కూడా రియల్ఎస్టేట్, లేఅవుట్లుగా మార్చేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని రైతులకు రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్కు మట్టి ధర రూ.రెండు వేలు, టిప్పర్ మట్టి ధర రూ.పది వేలు పైచిలుకు వరకు విక్రయిస్తున్నారు. దీంతో మట్టి ధర ఎక్కువగా పెరిగిపోవడంతో ఇంటి నిర్మాణాలు చేపట్టే పేదలు రేటు భరించలేని స్థితిలో లబోదిబోమంటూ అవస్థలు పడుతున్నారు. మండలంలోని పెదగొన్నూరు శివారు కొత్తపల్లి రైస్‌మిల్లు సమీపంలో, సింగరాయపాలెంలోని కోరుకొల్లు రోడ్డులో ఉన్న ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న లేఆవుట్, అల్లూరులో ప్రధాన రహదారి వెంబడి ఉన్న దేవస్థానం భూమి పక్క ఉన్న లేఆవుట్, సింగరాయపాలెంలోని కోరుకొల్లు రోడ్డులో ఉన్న పెట్రోల్‌బంకు ఎదురు లే అవుట్, ముదినేపల్లి సెంటర్‌లో పెట్రోల్ బంకు పక్క ఉన్న లే అవుట్‌లో రూ.లక్షలు విలువ చేసే మట్టిని విక్రయిస్తూ అధికార పార్టీ నాయకులు, మండలస్థాయి అధికారులు, పోలీసులు కుమ్మకై మట్టి దందా నడుపుతున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న జగనన్న కాలనీలు మెరక చేసేందుకు మట్టి లేదని చెప్పే అధికారులు, ప్రజాప్రతినిధులు అమ్ముకునేందుకు ఎక్కడ నుంచి మట్టి వస్తుందంటూ పేదలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో అనేక గ్రామాల్లో ఉన్న జగనన్న లే అవుట్లల్లో మట్టి పూడికలు చేయకపోవడంతో సామగ్రిని కాలనీలోకి తీసుకువెళ్లేందుకు రోడ్లు లేక అనేక మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. అనధికార మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవపోవంపై ఆయాగ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తుడు

బొమ్మినంపాడు నుంచి విచ్చలవిడిగా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న టిప్పర్లను, ట్రాక్టర్లను గ్రామస్తుడు ఇటీవల అడ్డుకున్నాడు. టిప్పర్లు నిరంతరాయంగా తిరుగుతున్న కారణంగా రోడ్లు పాడైపోతున్నాయని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున మట్టిని బయటకు తరలించరాదంటూ టిప్పర్లు అడ్డుకున్నాడు. దీంతో మట్టిమాఫియావారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ వ్యక్తిని పోలీసులు ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి క్లాస్ ఇవ్వడంతో సదరు వ్యక్తి ఊరకుంటిపోయాడు.

పాదచారులు, వ్యాపారలు ఇక్కట్లు

గ్రామం మధ్య నుంచి మట్టిలోడుతో వెళ్లే టిప్పర్లు ట్రాక్టర్ల రాకపోకలతో గ్రామస్తులు భయంభ్రాంతులకు గురవుతున్నారు. రోడ్డుపై వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. టిప్పర్లు మితిమీరిన వేగంతో వెళ్ళడంతో వెనుక ఉన్న ద్విచక్రవాహనదారులు, పాదచారుల కళ్లల్లో ఇసుక, మట్టి పడి ఇబ్బంది పడుతున్నారు. బొమ్మినంపాడు హైస్కూల్ ప్రధాన గేటు వద్ద నుంచే టిప్పర్లు రహదారిపైకి ఎక్కాలి. మితిమీరిన వేగంతో వచ్చే టిప్పర్ల వల్ల విద్యార్థులు ప్రమాదాలకు గురవుతారోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి మండలంలో జరిగే మట్టి మాఫియాను అరికట్టాలని మండల ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం : తహాశీల్దార్

బొమ్మినంపాడులో అక్రమ మట్టి తవ్వకాల విషయమై తహాశీల్దార్ కె.శ్రీనివాసరావును వివరణ కోరగా జగనన్న లేఅవుట్లు నేషనల్ హైవే విస్తరణ పనుల్లో మట్టి పూడికలకు మట్టి తరలిపోతున్నట్లు చెప్పారు. అక్రమ మట్టి తవ్వకం పనులను పరిశీలించేందుకు ఆర్ఐ శివకుమార్‌ను పంపామన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమాజాన్ని చైతన్యపరిచేవి ప్రజా కళారూపాలు

ప్రజానాట్యమండలి క్యాలెండర్ ఆవిష్కరణలో వక్తలు

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న లంకా వెంకటేశ్వర్లు, లేళ్ల వెంకటేశ్వరరావు, తదితరులు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజానాట్యమండలి 2023 క్యాలెండర్‌ను ప్రజానాట్యమండలి రాష్ట్ర క్యాలెండర్‌ను జిల్లా రిజిస్ట్రార్, సాహిత్య పరిశోధకులు లంకా వెంకటేశ్వర్లు, జిల్లా క్యాలెండర్‌ను లేళ్ల వెంకటేశ్వరరావు ఆదివారం ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళాకారుడు మానవ హృదయ నిర్మాత అని మహనీయులు చెప్పిన మాటను ప్రజానాట్యమండలి నిజం చేస్తోందని తెలిపారు. సమాజాన్ని చైతన్య పరిచే శక్తి ప్రజా కళ రూపాలకు ఉందన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పి.మంగరాజు మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా తెలుగు సాంస్కృతిక రంగంలో ప్రజానాట్యమండలి వందలాది ప్రజా చైతన్య గీతాలతో, కళా రూపాలతో చెరగని ముద్ర వేసిందన్నారు. అనేక ప్రజా ఉద్యమాల్లో ప్రజానాట్యమండలి రచయి తలు, కళాకారులు భాగస్వాములై ప్రజా సమస్యలపై తమ గళాన్ని వినిపిస్తున్నారని తెలిపారు. గౌరవ అధ్యక్షులు ఎల్.వెంకటేశ్వర రావు మాట్లా డుతూ ఒక్క సిరా చుక్క లక్ష లాది మెదడులను కదిలి స్తోం దని అన్న రచయిత కాళోజీ మాటలను అక్షరాల ప్రజానాట్యమండలి నిజం చేసిందన్నారు. నేటి యువతరానికి, విద్యార్థి లోకానికి కళలు, సాహి త్యం అవసరమని, నేటి సమాజంలో యువతను పెడదారి పట్టించే సంస్కృతి పెరుగుతుందని, దీన్ని నివారించేందుకు కళా సాహిత్య రంగాల్లో ప్రజానాట్యమండలి జోక్యం మరింత పెరగాలని ఆయన అన్నారు. నేటి సమాజం జానపద కళారూపాలను విస్మరిస్తుందని, మన సంస్కృతికి జీవనాడి జానపదాలు అని వాటిని రక్షించుకునే భాధ్యత మనదరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు తెల్లం వంశీ, ఉపాధ్యక్షులు నాగాస్త్ర, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ముస్తఫా అలీ, మహిళా నాయకులు సుధారాణి, విశ్రాంత ఉపాధ్యాయులు కస్తూరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, పి.కిరణ్, ఐలు నాయకులు ఎస్ఎన్ కట్టా పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు సక్రమంగా నిర్వహించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో అవకతవకలకు పాల్పడిన ఇన్‌ఛార్జి


ఎంఇఒకు విజ్ఞప్తి చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు (ఫైల్)

మండల విద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ భీమడోలు శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసంబద్ధంగా ఉన్న సర్దుబాటు ప్రక్రియ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత ఉపాధ్యాయులు పూర్తి వివరాలతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు యుటిఎఫ్ మండల అధ్యక్షులు గోడే జోసఫ్ రవికాంత్, ప్రధాన కార్యదర్శి జి.బాల భాస్కర్ తెలిపారు. వివిధ పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే ప్రక్రియలో వారు అంతవరకు పనిచేసిన స్థానానికి దగ్గరగా ఉన్న అవసరం ఉన్న పాఠశాలకు బదిలీ చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియలో మహిళా ఉపాధ్యాయులకు కొంత ప్రాధాన్యతను ఇచ్చే అవకాశాలు ఉన్నాయని, కాని భీమడోలు ఇన్‌ఛార్జి ఎంఇఒ వ్యవహరిస్తున్నా ఏలూరు డిఐడి సాంబశివరావు ఇష్టానుసారం 24 మంది ఉపాధ్యాయులను బదిలీ చేశారన్నారు. ఈ తరహాలో ఇబ్బందులు ఎదుర్కొన్న ఏడుగురు జిల్లా విద్యాధికారికి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. బదిలీ ఉత్తర్వులు వెలువడిన తర్వాత లోపాలను సవరించాలని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ ప్రముఖులు ఎంఇఒకు విజ్ఞప్తి చేసినప్పటికీ ఆయన పట్టించుకోలేదని వారు అంటున్నారు. దీంతో తాము జిల్లా విద్యాధికారికి వినతిపత్రాన్ని సమర్పించామని చెప్పారు.

పేదల సమస్యలపై సిపిఐ నిరంతర పోరాటం

బుట్టాయగూడెం: బడుగు బలహీన వర్గాల కోసం సిపిఐ నిరంతర పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. ఆదివారం మండలంలోని రాచూరు, కుమ్మరికుంట, లంకాలపల్లి, అచ్చయ్యపాలెం, నూతి రామన్నపాలెం గ్రామాల్లో ఆకుల దుర్గారావు అధ్యక్షతన శాఖా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ పేదరికంలో ఉన్న వారిని మరింత పేదరికంలోకి నెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ధనిక వర్గాలకు మేలు చేయడానికి కార్మికవర్గాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. 2014లో అధికారం చేజిక్కించుకున్న మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మోడీ ఏది చేసినా జగన్ సై అంటూ ప్రజావ్యతిరేక విధానాలకు సహకరించడం జగన్ చేతకానితనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ప్రజలను, రైతాంగాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు విద్యుత్ బిల్లును తీసుకువచ్చి మోటార్లకు మీటర్లు బిగించి రైతాంగాన్ని ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడగా వ్యవహరిస్తూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను పాడు చేస్తుందన్నారు. జిఒ ఒకటిని తీసుకొచ్చి సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి జగన్ ప్రభుత్వం చేస్తున్న చర్య సిగ్గుచేటని ఆయన విమర్శించారు. వివిధ కులు, మతాలున్న భారతదేశంలో మతోన్మాద రాజకీయాలు చేసి దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలో ఏళ్ల తరబడి గిరిజనులు పోడుకొట్టుకుని వ్యవసాయం చేస్తున్నారని, వారు సేద్యం చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలంటూ పలుమార్లు ప్రజాప్ర తినిధులకు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న నాధుడే లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

12న పలు అంశాల్లో పోటీలు

భీమడోలు: స్థానిక గ్రంథాలయంలో ఈనెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని యువతకు, నిరుద్యోగులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు తెలిపారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న తమకు ఇష్టమైన పుస్తకాన్ని ఎంచుకుని చదివారు. ఆ తరువాత వాటిపై నిర్వహించిన సమీక్షలో విశ్లేషకులుగా పాల్గొన్న గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉమామహేశ్వరరావు, స్వచ్ఛంద సంస్థ సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ బాలనాగు విజయ సారధి, సామాజిక కార్యకర్త మండే సుధాకర్ విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

బ్యాటింగ్ చేస్తున్న ముదినేపల్లి ఎస్ఐ షణ్ముఖసాయి

మండలంలోని గురజ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నీ ఉత్సాహభరితంగా సాగుతోంది. గత ఐదు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నీలో ఆదివారం ఉదయం ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ 11, గురజ జట్ల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. ఈ పోటీలో ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ జట్టు గురజ జట్టుపై 23 పరుగులతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ జట్టు నిర్ణీత పది ఓవర్లల్లో 64 పరుగులు చేయగా, గురజ జట్టు 41 పరుగులు చేసి ఓటమి చెందింది. అనంతరం సింగరాయపాలెం-కైకలూరు జట్ల మధ్య జరిగిన పోటీలో సింగరాయపాలెం 45 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన కైకలూరు జట్టు 42 పరుగులకే పరిమితమైంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన సింగరాయపాలెం జట్టు మూడు పరుగులు తేడాతో విజయం సాధించింది. గుడివాడ-దేవరం గ్రామాల జట్ల మధ్య జరిగిన పోటీలో గుడివాడ 57 పరుగులు చేయగా, అనంతరం లక్ష్యఛేదనలో దిగిన దేవరం జట్టు 36 పరుగులు చేసి ఓటమి పాలైంది. 22 పరుగులతో దేవరంపై గుడివాడ జట్టు విజయం సాధించింది.

బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మాట్లాడుతున్న ధర్ముల సురేష్

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై కార్మికవర్గం ఉద్యమించాలని ఎఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్ముల సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం భారత కార్మిక సంఘాల సమాఖ్య జంగారెడ్డిగూడెం డివిజన్ రెండో మహాసభ మంచిలి రాజు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ధర్ముల సురేష్ మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మికవర్గాల హక్కులను హరిస్తూ పరిపాలన సాగిస్తుందన్నారు. కార్మిక వర్గం అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక వర్గానికి ద్రోహం చేసిందని విమర్శించారు. దేశభక్తి ముసుగులో దేశద్రోహక విధానాలను అవలంభిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఒక పక్కన కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు రద్దు చేయడం, మరోపక్క దేశ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అమ్మడం, ఇంకోవైపు గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.లక్షల కోట్ల అప్పులు చేయడం చూస్తుంటే దేశాన్ని ప్రమాదకర స్థాయిలో తీసుకెళుతున్నారన్నారు. కార్మిక వర్గం నాయకత్వాన ఈ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. జిఒ1ని తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలను అణచాలని చూడటం అవివేకమని విమర్శించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బోనం చిన్నబ్బాయి, ఉపాధ్యక్షులుగా ఎడ్లపల్లి బుజ్జియ్య, దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా మంచిలి రాజు, కార్యదర్శులుగా ముప్పిడి అబ్బులు, తమ్మా సోమలింగ, మల్లికార్జునరావు, కోశాధికారిగా టి.రాణితో కలిపి 21 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది యు.ఏసుబాబు పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎస్.రామ్మోహన్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కారం రాఘవ, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఇ.భూషణం, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు వి.శిరోమణి, తోట శివకృష్ణ, మీసాల ఏసు, బి.వినోద్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1981-1982 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయసమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు గత స్మృతులను నెమరువేసుకున్నారు. చదువుకున్న పాఠశాల చుట్టూ కలియతిరుగుతూ, ఆత్మీయపలకరింపులతో ఆనందంగా గడిపారు. ఆపదలో ఉన్న మిత్రులకు సహాయార్థం, పలు సామాజిక సేవాకార్యక్రమాల నిమిత్తం ఒక నిధిని ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రమేష్, కె.రాజశేఖర్, డి.సీతారామస్వామి, సిహెచ్.సురేష్, ఎల్.పద్మజ, ఎ.నిరీక్షణరావు పాల్గొన్నారు.

ముత్తయ్యకు ముద్దరబోయిన పరామర్శ

ప్రజాశక్తి - చాట్రాయి

చనుబండ గ్రామానికి చెందిన టిడిపి నేత మోదుగు ముత్తయ్య ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఏలూరు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న ఆయనను నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, నూజివీడు మండల పార్టీ అధ్యక్షులు ముసునూరు రాజా, బిసి సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తలపంటి రాజశేఖర్, పార్టీ నాయకులు యనమదల సత్యనారాయణ (నాని), నియోజవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు తట్టుకోల శివనాగరాజు, సతీష్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పేరు మార్పు

ఎలిసేల ఆనంద రావు, నివాసం : 10-10-6, హరిజన పేట, 18వ వార్డు, తాళ్ళముదునూరుపాడు, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి (జిల్లా), ఆంధ్రప్రదేశ్-534102, అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా పేరు మరియు నా తండ్రి గారి పేరు **ఆనంద రావు ఇ, తండ్రి, ఇఆర్ రత్నం** అని తప్పుగా నాయొక్క సిబిఎస్ఇ మెట్రీకులేషన్ సర్టిఫికేట్‌లో నమోదు కాబడినది. కాని **ఎలిసేల ఆనందరావు, తండ్రి : ఎలిసేల రాజ రత్నం** గా అన్ని వ్యవహారాలలో ఉపయోగించవలెను.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. నెం. 49/2012 ఇన్
ఒ.యస్. నెం. 84/2008

బిట్వీన్:
శ్రీ మారిశెట్టి వెంకటేశ్వరరావు (died) మరియు మరి కొందరు ...డి. హెచ్. ఆర్‌లు
&
శ్రీ పులి లక్ష్మయ్య (died) మరి కొందరు ...జె.డి. ఆర్‌లు

పైన పేర్కొన్న డిక్రీ హోల్డరు జె.డి.ఆర్‌లపై డిక్రీ పొంది డిక్రీ వసూలు నిమిత్తము షెడ్యూలు స్థిరాస్తిని అమ్మి డిక్రీ బాకీ వసూలు చేయమని కోరుచూ శ్రీ కోర్టు వారి ఎదుట ఇ.పి. దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు షెడ్యూలు స్థిరాస్తిని వేలం పాట ద్వారా అమ్ముటకు ది. 02-02-2023 సం॥ తేదీ నిర్ణయించినారు. వేలం పాటలో పాల్గొని షెడ్యూలు స్థిరాస్తిని కొనుగోలు చేయుటకు యిష్టత ఉన్నవారు **ది. 02-02-2023 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయతు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయి పాట పాడుకొని కొనుగోలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

పూర్వం పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, భీమడోలు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో గల నారాయణపురం గ్రామపంచాయతీలో గల డోర్ నెం. 1-89, 200 చదరపు గజముల తాటియాకుల ఇంటికి సరిహద్దులు.
తూర్పు: శ్రీ దొడ్డిగర్ల ముసలయ్య గారి ఇల్లు.
దక్షిణం: రోడ్డు.
పడమర: శ్రీ కొమ్మిన ముసలయ్య గారి ఇల్లు స్థలం.
ఉత్తరం: శ్రీ మార్లపూడి బంగారయ్య గారి పెంకుటిల్లు, స్థలం.
పై హద్దుల మధ్య గల 200 చ॥గ॥ స్థలములో తాటియాకుల ఇల్లు స్థలము యావత్తు యీజిమెంటు హక్కులతో సహా.
డి. హెచ్. ఆర్. వాల్యూ: రూ. 1,25,000/-
అమీనా వాల్యూ: రూ. 10,00,000/-
జె.డి. ఆర్. వాల్యూ: రూ. 10,00,000/-

కొండేపాటి వెంకటేశ్వరరావు, అడ్వకేటు
తాడేపల్లిగూడెం, సెల్: 9848355344